క్లుప్తంగా

హెచ్‌ఎం మాధురి సేవలు అభినందనీయం



ఈపూరు: స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎంఎం మాధురి ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంఈఓ–1 సయ్యద్ జఫ్రుల్లా, ఎంఈఓ –2 రామతులసి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి చంద్రజిత్‌యాదవ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవిష్యత్‌కు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. మాధురి అంకిత భావంతో విధులు నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో లక్ష్యసాధన కోసం పనిచేయాలన్నారు. అనంతరం మాధురి దంపతులను ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ నాయకులు ఆవుల రమేష్, టీఏ సత్తార్, కె.జాషువా, తెనాలి పీపీ పి.సునిల్, ఉపాధ్యాయులు పి.జగన్మోహిని, పి.గాయత్రి, ఉపాధ్యాయ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, కరిముల్లా, కోట యోగేశ్వరరావు, కొంగ వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, రాజు, మాణిక్యరావు, బాలయ్య, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ డెలివరీ బాయ్ ఆత్మహత్య

నాదెండ్ల: ఆరోగ్య సమస్యలతో గ్యాస్ సిలిండర్ల డెలివరీ బాయ్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం వెలుగులోకొచ్చింది. ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు గణపవరం గ్రామానికి చెందిన నార్నె వినోద్‌కుమార్ (30) గత కొంత కాలంగా చిలకలూరిపేటలోని ఓ గ్యాస్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో జూలై 26న ఇంట్లో పురుగుమందు తాగాడు. గమనించిన బంధువులు చిలకలూరిపేటలోని వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య వేముల మేరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయులకు సహనం, సమయపాలన అవసరం



శావల్యాపురం: ఓర్పు, సహనం, సమయపాలన లక్షణాలు కల్గియున్న ఉపాధ్యాయులందరూ ఉత్తమ ఉపాధ్యాయులే అని ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీపీ స్కూల్లో ఉపాధ్యాయుడు భారతుల నరసింహశాస్త్రి ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ 23 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా సేవలు అందించి ఎందరో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం భారతుల నరసింహశాస్త్రిని పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బోడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయ సంఘం నేతలు బెజవాడ నాగేశ్వరరావు, గురుబాబు, రాజారమేష్, డి.రవికుమార్, గుండ్లూరి ప్రసాదు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాకేష్‌కు సాహితీ సేవా పురస్కారం



నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన సాహితీవేత్త గుండాల రాకేష్‌కు సాహితీ సేవా పురస్కారం లభించింది. కాకినాడ పీఆర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోదావరి కవితోత్సవంలో ఈ పురస్కారం అందజేశారు. తెలుగు భాషాభివృద్ధి, సాహిత్యం, కళలు, సంస్కృతి సంప్రదాయాల అభివృద్ధికి కవిత్వం ద్వారా రాకేష్ అందించిన సేవలకు గుర్తింపుగా సాహిత్య పురస్కారం లభించింది.

విద్యార్థులు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలి

చిలకలూరిపేట: విద్యార్థులు రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు చెప్పారు. ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని వివిధ విద్యాసంస్థల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి లోకాన్ని చైతన్య పరిచి విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఎప్పటి నుంచో కృషి చేస్తున్నదని తెలిపారు. విద్యార్థులు సంఘటితంగా మెలిగి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఫెడరేషన్ నాయకులు సాయినాయక్, కొత్తపట్నం గోపి, అన్నం శ్రీనివాస్, తెల్లబాటి సాహిత్, గుడిపల్లి జగదీష్, బొంతా భగత్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన

- ఆ దిశగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి
- డీవైఈఓ ఎన్.వేణుగోపాలరావు
- కొండవీడు యూపీ స్కూల్ సందర్శన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈఓ

యడ్లపాడు: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ ప్రవేశం.. ప్రావీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని నరసరావుపేట డీవైఈఓ ఎస్.వేణుగోపాలరావు పేర్కొన్నా. యడ్లపాడు మండలం కొండవీడు పీఎంశ్రీ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి డిజిటల్ క్లాస్‌రూం, ఆర్వో ప్లాంట్, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్తు సరఫరాను పరిశీలించారు. అనంతరం 7,8 తరగతుల విద్యార్థులను గణితం, హిందీ, ఇంగ్లీష్, సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. విద్యార్థులకు అభ్యసన మెళకువలను నేరిప్పించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, ఆహార పదార్థాల నాణ్యతను విద్యార్థులతో కలిసి రుచి చూశారు. ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు సంఖ్యలు, వర్ణమాల, ఇంగ్లిష్ అక్షరాల డిక్టేషన్ రాయించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. పీఎంశ్రీ పాఠశాలగా ఎంపిక కావడం, స్వచ్ఛ విద్యాలయం, హ్యాండ్ రైటింగ్‌లో అంతర్జాతీయ స్థాయి ఘనత సాధించడం, చిత్రలేఖనం, సాంస్కృతికం విభాగాల్లో విద్యార్థులు విజేతలు కావడంపై పాఠశాల హెచ్‌ఎం జి.శ్రీనివాసరావును అభినందించారు. విద్యలో వెనుకంజలో ఉన్నవారిని గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. ఈ సందర్భంగా హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లను డీవైఈఓ అందజేశారు. కార్యక్రమంలో ఎస్.పూర్ణచంద్రరావు, అంగన్‌వాడీ కార్యకర్త నీలేశ్వరి ఉన్నారు.

జీవన ఎరువులతో తెగుళ్ల నివారణ

చందవరంలో ట్రైకోథెర్మా కల్చర్‌పై రైతులకు అవగాహన



ట్రైకోథెర్మా కల్చర్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

నాదెండ్ల: రైతులు తయారు చేసుకున్న ట్రైకోథెర్మా కల్చర్‌ను వినియోగించుకున్నట్లయితే తెగుళ్ల నివారించుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి చెప్పారు. చందవరం గ్రామంలో రైతులకు ట్రైకోథెర్మాకల్చర్ తయారీ విధానాన్ని వివరించారు. 90 కేజీల పశువుల ఎరువుతో పాటూ 10 కేజీల నూనె తీసిన వేపపిండి, 2 కేజీల ట్రైకోథెర్మా పిండి సేకరించాలన్నారు. ముందుగా పశువుల ఎరువును మెత్తగా చేసుకుని ఒక పొరగా, దానిపై వేపపిండి, మరో పొరగా ట్రైకోథెర్మా పిండి పరుచుకుని నీడన ఆరబెట్టి గోనెపట్టా కప్పాలన్నారు. ప్రతిరోజూ మిశ్రమాన్ని చెమ్మతగ్గకుండా కొద్దిపాటి నీటితో తడపాలన్నారు. 11 రోజుల తర్వాత ఈ కల్చర్‌లో తెల్లటి బూజు ఏర్పడుతుందని, ఇలా తయారయిన మిశ్రమాన్ని ఒక ఎకరా పొలంలో చల్లి దుక్కి చేసినట్లయితే నీటి ద్వారా వ్యాపించే తెగుళ్ల నివారించుకోవచ్చన్నారు. ట్రైకోథెర్మాతో విత్తన శుద్ధి చేసుకున్నట్లయితే తెగుళ్ల నివారణ అవుతాయన్నారు. నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ, జీవ శిలీంద్రాలైన ట్రైకోథెర్మా, సూడోమోనాస్ వాడకం ద్వారా తెగుళ్ల నివారించుకోవచ్చన్నారు. జీవన ఎరువుల వినియోగంతో మంచి నాణ్యమైన దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. ఏఓ ఎ.హరిప్రసాద్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటివైద్య పరీక్షలు



విద్యార్థికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

నాదెండ్ల: ప్రతి ప్రాణికి కళ్లు ఎంతో ప్రధానమని, కంటి చూపు బాగుంటేనే మనుషుల మనుగడ సాఫీగా సాగుతుందని హెచ్‌ఎం కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కాకాని శంకర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు యోగిత, రితిక, వైద్య బృందం అపూర్వ, షిబ్లీలు సుమారు 600 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు ఉన్న 60 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు రిఫర్ చేశారు. కంటి లోపాలున్న మరో 25 మందిని ఆసుపత్రిలో వైద్యం కోసం సిఫార్సు చేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవటంతో పాటూ టీవీ, సెల్‌ఫోన్ తక్కువగా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

శావల్యాపురం పంచాయతీ కార్యాలయంలో...

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి వైద్యశాల వారి సారధ్యంలో ఉచితంగా కంటి వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. ఈకంటి వైద్యశిబిరంలో వైద్య సేవలు పొందే వారందరు ఆరోగ్యశ్రీ కార్డు, హెల్త్ కార్డు, ఆధార్, రైస్‌కార్డు, తదితర ఆధారాలు అందజేసి తమ పేర్లను శిబిరంలో నమోదు చేసుకున్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 155 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో కంటి శుక్లముల ఆపరేషన్లు చేయించుకునేవారు 47 మందిని గుర్తించారు. శిబిరంలో ఉచితంగా మందులు అందజేశారు. ఈశిబిరంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు దూదేకుల హుస్సేన్, గ్రామపెద్దలు చెరుకూరి వెంకటేశ్వర్లు (చౌదరి) పాలడుగు ఏడుకొండలు, చిట్టేటి రవి, పత్తిపాటి కోటిలింగం, పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర, వైద్యులు పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు గురువారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. మండలంలో మొత్తం 9,581 మంది లబ్ధిదారులకు గాను రూ.4,03,48,000లు పంపిణీ చేయాల్సి ఉంది. బుధవారం బ్యాంకుల నుంచి నగదు విత్‌డ్రా చేసి సచివాలయ సిబ్బంది సిద్ధంగా ఉంచారు. ఉదయం 5 గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛను సొమ్ము పంపిణీ చేస్తారని, ఇతర ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారులు గురువారం పింఛను సొమ్ము పొందేందుకు స్వస్థలాల్లో అందుబాటులో ఉండాలని కోరారు.

పది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నరసరావుపేట రూరల్: జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగినా.. విద్యాబుద్ధులు చెప్పిన పాఠశాలను మరువకూడదని రిటైర్డ్ హెచ్‌ఎం ఎంఎస్‌ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం గత ఏడాది పదవ తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 2002–03 బ్యాచ్ విద్యార్థుల సహకారంతో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ప్రసాద్, హెచ్‌ఎం బీవీఏఎల్ వరప్రసాద్, పార్వతి తదితరులు పాల్గొన్నారు. పదవ తరగతిలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన చినపాట్టి నాగార్జున గుప్తా, గోపిశెట్టి ఉజ్వల, అజయ్‌కుమార్ రెడ్డిలకు నగదు ప్రోత్సాహక బహుమతులను అతిథులు అందజేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

శావల్యాపురం: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ ప్రభుత్వం ప్రకటించినట్లు ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు తెలిపారు. బుధవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఎంఈఓ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు సంబంధించిన చైర్మన్, వైస్ చైర్మన్, ఎస్ఎంసీ సభ్యుల పునర్వవస్థీకరణ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. అదేరోజు నోటీసు బోర్డులో ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితా ప్రదర్శన కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటల తర్వాత జరుగుతుందన్నారు. ఈనెల 5న ఓటర్ల జాబితాలో అభ్యంతరాల స్వీకరణ, ఫిర్యాదులను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట సమయంలోపు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. అదేరోజు సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఎన్నికల నిర్వహణ కోసం తుది ఓటర్ల జాబితాను నోటీసు బోర్డులో ఏర్పాటు చేస్తారన్నారు. ఈనెల 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. కమిటీ సభ్యులచే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందన్నారు. మొదటి పాఠశాల నిర్వహణ కమిటీ సమావేశం అదేరోజు సాయంత్రం 3 నుంచి 3.30 నిమిషాలకు వరకు మండలంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సారధ్యంలో నిర్వహించాలన్నారు.

చెరువు కట్టను పటిష్ట పరచాలి

వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే జీవీ

బొల్లాపల్లి: చెరువు కట్టను సత్వరమే పటిష్ట పరచాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచించారు. కోతకు గురైన మూగచింతలపాలెంలోని వెలమవారి చెరువును మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి ఎమ్మెల్యే జీవీ సందర్శించారు. చెరువు కట్టను, గండి పడ్డ ప్రాంతాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. తూము వద్ద గండి పడటంతో నీరంతా వృథా అవుతుందని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద మొరపెట్టుకున్నారు. కట్టను పటిష్టంగా నిర్మించి రైతులకు నష్టం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యేతో పాటు మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా చెరువు కట్టను పరిశీలించారు. ఇరిగేషన్ డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ ఎ.కవిత ఉన్నారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

వాసవి అమ్మవారి ఆలయంలో ఘనంగా ఆషాఢ మాసం ముగింపు వేడుకలు



వాసవి అమ్మవారికి సారె తీసుకొని వెళ్తున్న భక్తులు

రొంపిచర్ల: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బుధవారం ఆషాఢ మాసం ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి అమ్మవారికి ఆర్య వైశ్యులు, గ్రామస్తులు ఆషాఢ మాస సారెను సమర్పించారు. గ్రామంలోని చెరువు కట్ట సెంటర్ నుంచి అమ్మవారి దేవాలయం వరకు సారెకు మేళతాళాలతో శోభయాత్ర కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న భక్తులు జై వాసవి, జైజై వాసవి అంటూ నినాదాలు చేశారు. శోభయాత్ర ఆలయంలోకి ప్రవేశించిన అనంతరం వాసవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆషాఢ మాస సారె సమర్పించారు. అనంతరం ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు.

రోటరీ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న రోటరీ జిల్లా గవర్నర్ ఎలక్ట్ డాక్టర్ శివరామ ప్రసాద్

చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం రోటరీ క్లబ్ అని రోటరీ జిల్లా గవర్నర్ ఎలక్ట్ డాక్టర్ శివరామ్‌ప్రసాద్ చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం రాత్రి రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఆళ్ల వేమనరెడ్డి, కార్యదర్శిగా ఉప్పుటూరి ప్రసాద్, కోశాధికారిగా కటకం శివరామప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరామ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని చెప్పారు. నూతన కార్యవర్గం ద్విగుణీకృత ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీతో పాటు క్రీడాకారులకు సన్మానాలు నిర్వహించారు. జాష్టి రంగారావు, కందిమళ్ల అంజిబాబు, గల్లా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు సీమంతం



గోపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక సేవా స్రవంతి, పల్నాడు వనితా శక్తి విభాగ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీపట్టాభిరామ స్వామి దేవాలయంలో గోమాతకు సీమంతం ఉత్సవాన్ని నిర్వహించారు. గోమాతకు చీర, సారె సమర్పించి ఇస్కాన్ భక్తబృందం పర్యవేక్షణలో వేద మంత్రోచ్ఛరణలతో గోపూజ జరిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, సేవా స్రవంతి వ్యవస్థాపకుడు జల్లి శ్రీనివాసరావు, వనితా శక్తి విభాగ్ అధ్యక్షురాలు యక్కల సుజాత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం సర్పంచ్ ముసుగు శోభారాణి భూమి పూజ నిర్వహించారు. రూ.50 లక్షల వ్యయంతో సైడు కాల్వలు, సీసీ రోడ్లు నిర్మానం చేయనున్నారు. వార్డు సభ్యులు, పంచాయతీ రాజ్ ఏఈ రమణారెడ్డి, జంపని వీరవసంతరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: వ్యాధి రావడం కంటే..రాకుండా చూసుకోవడమే ముఖ్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని ఒకటో వార్డు నుంచి ఐదోవార్డు పరిధిలోని సీబీఎస్ కాలనీ, ఐలా బజార్, నిమ్మతోట, పనసతోట, క్రిష్టియన్‌పాలెం పరిధిలో 300 మంది శానిటేషన్ సిబ్బందితో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. మురుగు కాలువల్లో దిగి కాలువల్లోని మురుగు తొలగించారు. బ్లీచింగ్ చల్లారు. యాంటీ లార్వా స్ప్రేయింగ్, ఫాగింగ్ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి, మున్సిపల్ ఇంజినీర్ బి.కనకారావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బి.రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి..

రొంపిచర్ల: ప్రతి ఇంటికి రక్షిత తాగు నీరును అందించే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని వీరవట్నం, కొనకంచివారి పాలెం గ్రామాల్లో బుధవారం పర్యటించి జలజీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. నల్లపాటి రాము, గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలకు అండగా ఉంటాం..

నరసరావుపేట రూరల్: జిల్లాలో ఎక్కడ విపత్తులు సంభవించినా రెడ్‌క్రాస్ సహాయ, సేవా కార్యక్రమాలను అందించాలని, అందుకు తమ సహాయ సహకారాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హామీ ఇచ్చారు. మంగళవారం రాత్రి మండలంలోని కేసానుపల్లి గ్రామ యానాదుల కాలనీలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 100గృహాల కాలనీవాసులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా టార్పాలిన్ పట్టాలను అందించారు. కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు కొన్ని ఇల్లు దెబ్బ తిని ఇళ్లు నీరు కారుతున్నందున ఇళ్లపై కప్పుకునేందుకు టార్పాలియన్ పట్టలను రెడ్ క్రాస్ అందజేస్తుందన్నారు. జిల్లా చైర్మన్ డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డిని, సభ్యులను అభినందించారు.

దళితులను రాజ్యాధికారానికి దూరం చేసే కుట్ర

కరపత్రాలు ఆవిష్కరించిన మాల మహానాడు నాయకులు



కరపత్రం ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

నరసరావుపేట: దళితులను విడగొట్టి వారికి శాశ్వతంగా రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రకు బీజేపీ నాయకులు పూనుకున్నారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం ఎన్‌జీఓ కార్యాలయంలో వర్కింగ్ అధ్యక్షుడు ఉస్తేల జయరావు అధ్యక్షతన హాలో మాల, చలో ఢిల్లీ పేరిట ఆగస్టు తొమ్మిదో తేదీన ఢిల్లీలో నిర్వహించే మాలల మహా ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. జాన్‌పాల్ మాట్లాడుతూ మహా ధర్నాకు పల్నాడు జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజశేఖర్, సత్తనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం, పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మాతంగి సుధాకరరావు, స్వర్ణ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి జయంతి వేడుకలు



నాదెండ్ల: అభ్యుదయకవి దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతి వేడుకలు బుధవారం గణపవరంలోని చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా దాశరథి కవిత్వంలో సామాజికత, శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పీవీ సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నుపాటి చైతన్య, జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దార్ల బుజ్జిబాబు, తెలుగు అధ్యపకురాలు సువార్త వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యడ్లపాడుకు సామాజిక తనిఖీ బృందం

యడ్లపాడు: మహాత్మగాంధీ గ్రామీణ జాతీయ ఉపాధిహామీ పథకం పనులు పరిశీలన బృందం బుధవారం మండలానికి విచ్చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పనులను క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించేందుకు ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చారు. సామాజిక తనిఖీల విభాగం స్టేట్ రిసోర్సుపర్సన్ జీఎస్ రాజు పర్యవేక్షణలో ఉపాధి పనులు తనిఖీలు చేయనున్నారు. ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖలకు చెందిన పనులు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు



భోజనం పరిశీలిస్తున్న గార్లపాటి దాసు

క్రోసూరు: పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినడానికి బాగుండటం లేదని అనేక మంది విద్యార్థులు మానేయడం విచారకరమని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దృష్టికి తీసుకెళ్తామని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటి దాసు అన్నారు. క్రోసూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఆయన పలువురితో కలిసి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలు గుర్తించినట్లు చెప్పారు. పాఠశాలలో 540 మంది విద్యార్థులుంటే.. కేవలం 120 మంది మాత్రమే భోజనం చేస్తున్నారని తెలిపారు. దీనిపై హెచ్‌ఎం రామాంజనేయులు వివరణ కోరగా.. విద్యార్థులు ఎక్కువ శాతం ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నారని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. తల్లిదండ్రులు మాత్రం భోజనం సరిగా వండటం లేదని చెప్పినట్లు వివరించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ నుంచి తాగునీరు కూడా రావటం లేదని, అది చాలా రోజులుగా మరమ్మతులకు గురైనట్లుగా తెలిపారు. ఆరవ తరగతి విద్యార్థులు 16 మందికి ఇంత వరకు పాఠ్యపుస్తకాలు అందలేదని దాసు వివరించారు. ఉపాధ్యాయులు సురేష్, బాబురావు, రామాంజనేయులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎంపీడీఓ కుసుమ కుమారి

అచ్చంపేట: నీటిని వృథా చేయొద్దని, పొదుపుగా వాడుకోవాలని, వాడిన నీరు భూమిలోకి ఇంకిపోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవో కుసుమ కుమారి సూచించారు. జలశక్తి అభియాన్, నారీ సే జల శక్తి కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది బుధవారం అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. భూగర్భ జలాలను పొందించుకోవాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని వివరించారు. నీటిని పొదుపుగా వాడుకుంటామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు. ఎంపీపీ నరసింహారెడ్డి, ఏపీఎం నాగ శ్రీనివాస్, వెలుగు ఏపీఓ సలీమ్, యానిమేటర్స్, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.